'సండే ఈవెనింగ్ టాక్'

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్‌లో ఆదివారం 'సండే ఈవినింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహించనునానరు, సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. 'ది ప్రెజెంట్ ప్రాసెస్సార్: లివింగ్ నౌ, వర్కింగ్ బెటర్' అనే అంశంపై వెంచర్ క్యాపిలటిస్ట్ బి.కె. రిషిధర్ ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 040-23001234లో సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో నియామకాలకు గ్రీన్ సిగ్నల్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న క్యాంపస్ స్కూల్‌లో ఖాళీల భర్తీకి అనుమతి లభించింది. క్యాంపస్ స్కూల్‌లో పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ),ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ), ప్రైమరీ టీచర్(పీఆర్‌టీ) పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోనున్నారు.ఈ మేరకు ఉన్నతాధికారుల అనుమతులు రావడంతో ఈనెల 16న ఇంటర్వ్యూలను నిర్వహించాలని నిర్ణయించారు. అదే విధంగా పీటీజీ కంప్యూటర్‌సైన్స్, టీజీటీ ఇంగ్లిష్, సోషల్ సైన్స్, సైన్స్, ఈవీఎస్-ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల టీచర్ పోస్టులకు ఈనెల 17న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. హెచ్‌సీయూలోని క్యాంపస్ స్కూల్‌లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు తెలిపారు.

పానీయాల పంపిణీ



అపర్ణ సైబర్ లైఫ్ భక్తి సేవా మండలి ఆధ్వర్యంలో జ్యూస్ పంపిణీ చేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: నల్లగండ్లలోని అపర్ణ సైబర్ లైఫ్ భక్తి సేవా మండలి ఆధ్వర్యంలో నిర్జల ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం మంచినీరు, జ్యూస్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలి ప్రతినిధి పండిత మాట్లాడుతూ నిర్జల ఏకాదశి సందర్భంగా ఉపవాస దీక్షలు పాటిస్తారన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ భక్తి సేవా మండలి ప్రతినిధులు శ్రీకాంత్ జాదవ్, ప్రదీప్‌ఆనంద్‌శర్మ, రాకేష్ జిందాల్, యుధిష్టర్ కుమార్ అరోరా, రాకేష్‌అరోరా, మీనా విజయ్, బిజయ్ బెహరా, అనీల్, సురేష్ మరాటే, మోహన్సౌధరి పాల్గొన్నారు.

పేపర్ వినియోగం పెరగాలి

హైటెక్స్‌లో పేపర్ ఎక్స్‌పో 2025 ప్రారంభం • మూడు రోజుల పాటు నిర్వహణ



హైటెక్స్‌లో పేపర్ ఎక్స్‌పోను ప్రారంభిస్తున్న అతిథులు

మాదాపూర్: దేశంలో తయారవుతున్న, వినియోగిస్తున్న పేపర్‌లో 80శాతం రీసైకిల్ చేసిన వనరుల నుంచే ఉత్పత్తి అవుతుందని పాపిరస్ ఎక్స్ పో ఎల్ఎల్‌పి సీఈఓ నిర్మల్‌కుహద్ అన్నారు. శుక్రవారం హైటెక్స్‌లో పేపర్ ఎక్స్‌పో 2025ను ప్రగతి ఆఫ్‌సెట్ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ పరుచూరి నరేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రదర్శన మూడు రోజుల పాటు కొనసాగుతుందన్నారు. పేపర్ వినియోగం ప్రోత్సహించడమే లక్ష్యమన్నారు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో భారతదేశం ఒకటన్నారు. వ్యక్తిగత పేపర్ వినియోగం అతి తక్కువ స్థాయిలో ఉందన్నారు. పేపర్ వినియోగం వనరుల నాశనానికి దోహదం చేస్తుందన్న అపోహను తొలగించడమే ఎగ్జిబిషన్ ముఖ్య ఉద్దేశమన్నారు. దేశంలో పల్ప్ అండ్ పేపర్ పరిశ్రమ విలువ సుమారు రూ.80కోట్లుగా ఉందన్నారు. ఈ రంగంలో దాదాపు 20లక్షల మంది పని చేస్తున్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా మెల్లగా తగ్గుతున్న విభాగమన్నారు. కోవిడ్‌కు ముందు దేశంలో న్యూస్‌ప్రింట్ డిమాండ్ 20లక్షల టన్నులు ఉండేదన్నారు. ప్రస్తుతం అది 10 లక్షల టన్నులకు పరిమితం అయ్యిందన్నారు. డిజిటలైజేషన్ కారణంగా 50శాతం వాడకం తగ్గిందన్నారు. కోటెడ్ పేపర్ వాడకం తగ్గుతుందన్నారు. బ్రోచర్లు, ప్రమోషనల్ మెటీరియల్ కూడా డిజిటల్ వైపు వెళుతున్నాయన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో పేపర్, పల్ప్ తయారీదారులు, ప్యాకేజింగ్ సంస్థలు, యంత్రాల సరఫరాదారులు, పబ్లిషర్లు, ఎగుమతిదారులు, వ్యాపారులు పాల్గొంటున్నట్లు తెలిపారు. ఐపీపీటీఏ జనరల్ సెక్రటరీ ఎంకే గోయల్, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ డిప్యూటీ డైరెక్టర్ నటరాజ్, పాపిరస్ ఎక్స్‌పో ఎల్ఎల్‌పి అధ్యక్షుడు బీఆర్‌రావు, డైరెక్టర్ అరవింద్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిదత్త గణపతి ఆలయ వార్షికోత్సవం



సాయిబాబాకు పంచామృతాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గం: అర్చకుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. శుక్రవారం టెలికామ్‌నగర్‌లోని సాయి దత్తగణపతి దేవాలయంలో ఆలయ 11వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తుల ఆలయానికి చేరు షిర్డీ సాయిబాబాకు కాగడ హరతితో ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం గణపతిపూజ, పుణ్యావాహచనం, మంటపారాధన తదితర పూజలు నిర్వహించారు. అనంతరం గణ పతి, దత్తాత్రేయస్వామి, సాయిబాబాకు ప్రత్యేక పంచామృతాభిషేకం, మంగళస్నానాలు, ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో రుద్రహోమం, నవగ్రహహోమం, ప్రతిష్టామూర్తుల హోమం చేశారు. ఈ సందర్భంగా భక్తులు సామూహిక విష్ణుసహస్రనామ సహిత లక్ష్మీ అష్టోత్తర పారాయణం, సాయిచాలీసా, నక్షత్రమాలిక పారాయణం చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. సాయంత్రం సాయిబాబా పల్లకిసేవా కార్యక్రమం నిర్వహించారు.

చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న సయ్యద్ అజీజ్ పాషా

చందానగర్: చంద్ర రాజేశ్వరరావు తన జీవితాన్ని పేదలకే అంకితం చేశారని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఆర్ ఫౌండేషన్ ఫర్ సోషల్ ప్రొగ్రెస్ ఉపాధ్యక్షుడు, సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యులు సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. శుక్రవారం చంద్ర రాజేశ్వరరావు 111వ జయంతిని పురస్కరించుకుని కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లో ఆయన విగ్రహానికి సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శులు చెన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పీజే చంద్రశేఖర్‌రావులతో కలి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్ళర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఆర్ జీవితం మొత్తం దేశం కోసం సేవ చేశారని, ఆయన ప్రజల కొరకు ఎన్నో త్యాగాలు చేశారన్నారు. ఉత్తర భారత దేశంలోని ఒక జిల్లాలో సంక్షోభం ఏర్పడితే వారం రోజులు అక్కడే ఉండి ప్రజా ప్రజల బాగోగులను చూసుకుంటూ 500 మందిని రక్షించారన్నారు. ప్రధాని నెహ్రూ పాలనకు వ్యతిరేకంగా పోరాడి దేశ సమగ్ర అభివృద్ధికి కృషి చేశారన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడుస్తూ పీడిత ప్రజల అభ్యున్నతికి, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ కోశాధికారి చెన్నకేశవరావు, ఆరోగ్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ కె.రజిని, ఎఐటియూసి మాజీ కార్యదర్శి బీవి విజయలక్ష్మి, మహిళ సంక్షేమ కేంద్రం డైరెక్టర్ జోశ్యభట్ల కల్పన, వృద్ధాశ్రమ సలహా కమిటి సభ్యులు డాక్టర్ మండవ గోపిచంద్, తమ్మారెడ్డి తాన్య, యస్.రాజేంద్రరావు, డాక్టర్ పి.సరస్వతి, మహిళా సంక్షేమ కేంద్రం సభ్యులు లలిత, టెక్సాస్ యూనివర్సిటి స్కాలర్ మిస్ మేరీ, వృద్ధాశ్రమ వాసులు, విద్యార్థినీలు తదితరులు పువ్వులు వేసి నివాళ్ళు అర్పించారు.

'ఐఎస్‌బీ'కి 'ఈక్యూయూఐఎస్' రీ అక్రిడిటేషన్



ఐఎస్‌బీ క్యాంపస్

రాయదుర్గం: దేశంలోనే నెంబర్ బిజినెస్ స్కూల్‌గా గుర్తింపు పొందిన గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మరో అంతర్జాతీయ గుర్తింపును మరోసారి సాధించింది. ప్రతిష్టాత్మకమైన యూరోపియన్ క్వాలిటీ ఇంప్రూవ్‌మెంట్ సిస్టమ్(ఈక్యూయూఐఎస్) అక్రిడిటేషన్‌ను మరోసారి సాధించింది. మరో ఐదేళ్ల పాటు ఈక్యూయూఐఎస్ గుర్తింపు కొనసాగుతుంది. ప్రపంచవ్యాప్తంగా వ్యాపార, నిర్వహణ విద్యాసంస్థలకు యూరోపియన్ ఫౌండేసన్ ఫర్ మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్ (ఈఎఫ్ఎండీ) అందించే ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన అక్రిడిటేషన్‌గా దీనికి గుర్తింపు ఉంది. మరోసిరి ఈ అక్రిడిటేషన్‌కు పొడిగిస్తూ సంస్థకు గుర్తింపునివ్వడం పట్ల పలువురు ఐఎస్‌బీ ఫ్యాకల్టీ, అధికారులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ట్రైనీ ఐఏఎస్‌ల పరిశీలన



శేరిలింగంపల్లి: శేరిలిగంపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ట్రైనీ ఐఏఎస్‌ల బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి తహసీల్దార్ వెంకారెడ్డి వారికి భూభారతి పోర్టల్‌పై అవగాహన కల్పించారు. భూ భారతిలో పలు సమస్యల పరిష్కారానికి ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలో చూపించారు. ట్రైనీ ఐఏఎస్‌ల బృందంలో కె. ప్రణయ్ కుమార్, కరోలిన్, సౌరభ్ శర్మ ఉన్నారు.

సజావుగా భూభారతి సదస్సులు

జిన్నారం(పటాన్‌చెరు): ఉమ్మడి జిన్నారం గుమ్మడిదల మండలాల్లో భూభారతి సదస్సులు సజావుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం జిన్నారం మండల గ్రామంలో 49, మాదారంలో 46 దరఖాస్తులను అధికారులకు అందజేసినట్లు తహసీల్దార్ దేవదాస్ పేర్కొన్నారు. గుమ్మడిదలలో 78 అర్జీలు రైతులు అందజేసినట్లు తహసిల్దార్ పరమేశం తెలిపారు.

అంబేడ్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

పటాన్‌చెరు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆలోచనలు, ఆశయాల సాధనకు ప్రతీ ఒక్కరు కంకణబద్ధులు కావాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. యువత అంబేడ్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ గ్రామ పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీలో గ్రామ మాజీ సర్పంచ్ అంతిరెడ్డి సొంత నిధులతో ఏర్పాటు చేసిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని శుక్రవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అంతకుముందు అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్‌గూడ గ్రామంలో మాజీ ఎంపీపీ దేవానంద్ సొంత నిధులతో నిర్మించిన శ్రీశ్రీశ్రీ దుర్గామాత దేవాలయం స్వాగత తోరణాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పటేల్‌గూడ గ్రామంలో నిర్వహించిన వన మహోత్సవం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన జీవితాన్ని బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి అంకితం చేసిన మహానీయుడు అంబేడ్కర్ అని తెలిపారు. ఆయన స్ఫూర్తిని భవిష్యత్తు తరాలకు అందించాలన్న లక్ష్యంతో నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన విగ్రహాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. నూతన దేవాలయాల నిర్మాణాలకు..అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని ప్రతి ఒక్కరూ దైవ భక్తిని పెంపొందించుకోవాలని కోరారు.

మేకల దొంగ అరెస్ట్



మియాపూర్: మేకల దొంగతనానికి పాల్పడిన ఓ వ్యక్తిని అరెస్ట్ చేసిన పోలీసులు అతడి నుంచి 32 మేకలను స్వాధీనం చేసుకున్న సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఐ రమేష్ నాయుడు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మియాపూర్ స్టాలిన్ నగర్ కు చెందిన కొంపల్లి వెంకటేష్ మేకల వ్యాపారం చేసేవాడు. తన ఇంటి పక్కన ఖాళీ స్థలంలో ప్రహరీ నిర్మించి 40 మేకలను అందులో ఉంచేవాడు. ఈ నెల 3న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 32 మేకలను ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు మహమ్మద్ హతల్ హుస్సేన్ అనే వ్యక్తి మేకలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. శుక్రవారం అతడిని అరెస్ట్ చేసిన పోలీసులు అతడి నుంచి 32 మేకలను స్వాధీనం చేసుకున్నారు.